# హెబ్రయులకు వ్రాయబడిన పత్రిక

## ఎనిమిదవ పాఠము

# పరిశుద్ధత లేకుండ ఎవడును ప్రభువును చూడడు.

**పాఠ్యోద్దేశము:** హెబ్రీ పత్రికను ఎక్స్‌జీసస్ చేయు పనిని పూర్తి చేయుట.

## ఉపోద్ఘాతము

క్రింద పేర్కొన్నవి గ్రంథకర్త హెబ్రీయులకు వ్రాసిన పత్రికలో అతని శైలిని సమీక్షించు విషయములు.

**హెబ్రీ 1:4-2:16.**

మొదటి మెట్టు. దేవదూతలు. తమ సంస్కృతినుండి హెబ్రీ క్రైస్తవులు దేవదూతలను గూర్చి ఎరుగుదురు. దేవదూతలు ద్వారా పలుకబడిన సందేశము పట్ల వారు బద్ధులు అను విషయము వారెరుగుదురు (2:2).

రెండవ మెట్టు. యేసు శ్రేష్ఠుడు. దేవుని రాజ్యసింహాసనము దేవుని కుమారుడైన యేసు క్రీస్తుకు ఇవ్వబడెను. గనుక ఆయన దేవదూతల కంటే శ్రేష్ఠుడు. ఆయన మాట విని, ఆయనకు లోబడవలెను. మొదటి అధ్యాయము చూడుము.

మూడవ మెటు. హెచ్చరిక. 'మరి విశేష జాగ్రత్త కలిగి యుండవలెను' 2:1-4.

**హెబ్రీ 3:1-15.**

మొదటి మెట్టు. మోషే దేవుని ఇల్లంతటిలో నమ్మకమైన పరిచారకుడు.

రెండవ మెట్టు. 'అయితే క్రీస్తు కుమారుడైయుండి దేవుని ఇంటి మీద నమ్మకముగా ఉన్నాడు' 3:6.

మూడవ మెట్టు. హెచ్చరిక. 'ధైర్యమును నిరీక్షణవలని ఉత్సాహమును తుదమట్టుకు స్థిరముగా చేపట్టవలెను' 3:6-15.

**హెబ్రీ 3:16-4:16.**

మొదటి మెట్టు. దేవుడు తన ప్రజలకు విశ్రాంతిని వాగ్దానము చేసిన సంగతి హెబ్రీ క్రైస్తవులకు తెలుసును.

రెండవ మెట్టు. ఆ విశ్రాంతి క్రీస్తునందు ఇంకా అందుబాటులో ఉన్నది.

మూడవ మెట్టు. హెచ్చరిక. 'మీలో ఎవడైనను ఒకవేళ ఆ వాగ్దానము పొందకుండ తప్పిపోవునేమో అని భయము కలిగియుందము' 4:1,2,11.

**హెబ్రీ 5:1-6:20.**

మొదటి మెట్టు. ప్రతి ప్రధానయాజకుడు దేవునిచేత పిలువబడవలెనను విషయము వారికి తెలుసును 5:4.

రెండవ మెట్టు. మెల్కీసెదెకు క్రమము చొప్పున యేసు దేవునిచేత పిలువబడెను 5:5; 6:20.

మూడవ మెట్టు. హెచ్చరిక. 'మీరు మందులు కాకుండవలెనని మా ఉద్దేశము.' 5:10-6:12ను చూడుము.

**హెబ్రీ 7:1-10:18.**

మొదటి మెట్టు. లేవి యాజకత్వపు క్రమమును గూర్చి వారికి తెలుసును.

- ఎ. దేవాలయములోని అతిపరిశుద్ధ స్థలమును గూర్చి, అక్కడ ప్రధాన యాజకుడు దేవుని కృపాసనమును సమీపించుటను గూర్చి వారికి తెలుసును.
- బి. సీనాయి కొండ మీద ఇవ్వబడిన పాతనిబంధనను గూర్చి వారికి తెలుసును.
- సి. పాపము కొరకు అర్పింపబడు జంతుబలులను గూర్చి వారికి తెలుసును.

రెండవ మెట్టు. మెల్కీసెదెకు క్రమము చొప్పున యేసు పిలువబడెను.

- ఎ. యేసు పరలోకములోని నిజమైన పరిశుద్ధస్థలములో సేవచేయుచున్నాడు.
- బి. దేవుడు తన జీవనియమములను క్రైస్తవుల హృదయములోను మనస్సులోను పెట్టి క్రొత్త నిబంధన చేయుచున్నాడు. క్రొత్త నిబంధన, దేవునికి కుమారులను తయారు చేయును.
- సి. యేసు నిత్యమైన విమోచనను సంపాదించి అందరి నిమిత్తము అతిపరిశుద్ధస్థలములోనికి తనస్వరక్తముతో ప్రవేశించెను.

మూడవ మెట్టు. హెచ్చరిక. 'విశ్వాస విషయములో సంపూర్ణ నిశ్చయత కలిగి, యదార్థ మైన హృదయముతో మనము దేవుని సన్నిధానమునకు చేరుదము' 10:19-39.

**హెబ్రీ 11:1-12:13.**

మొదటి మెట్టు. పదకొండవ అధ్యాయములో ఉదహరింపబడి మేఘమువలె ఆవరింప బడిన గొప్ప సాక్షి సమూహమును గూర్చి వారికి తెలుసును. దేవుని వాగ్దానముల పట్ల విశ్వాసము కలిగి జీవించినందుకు వారు పడిన శ్రమలను గూర్చి కూడ వారికి తెలుసును.

రెండవ మెట్టు. 'వీరందరు తమ విశ్వాసము ద్వారా సాక్ష్యము పొందినవారైనను మనము లేకుండ సంపూర్ణులు కాకుండు నిమిత్తము దేవుడు మన కొరకుమరి శ్రేష్ఠమైన దానిని ముందుగా సిద్ధపరచెను. గనుక వీరు వాగ్దాన ఫలము అనుభవింపలేదు' హెబ్రీ.11:39,40.

మూడవ మెట్టు. హెచ్చరిక. 12:1-13.

*నా కుమారుడా, ప్రభువు చేయు శిక్షను తృణీకరించకుము ఆయన నిన్ను గద్దించినపుడు విసుకకుము ప్రభువు తాను ప్రేమించు వారిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును. 12:5,6.*

## పాఠము

దయచేసి ముందు పాఠములోగల 'మూడవ విషయము-హెచ్చరిక'ను సమీక్షిం చుము. పదకొండవ అధ్యాయము తరువాత గ్రంథకర్త చేసిన హెచ్చరికను మూడు భాగములుగా విభజించ వచ్చునను విషయమును గమనించాలి. ఇంతకు ముందు పాఠము చివరన మొదటి భాగమును గమనించితిమి.

12:14-17లో రెండవ హెచ్చరిక కనబడును. వారు బాగా ఎరిగియున్న ఏశావును ఎన్నుకొని, 'అందరితో సమాధానమును పరిశుద్ధతయు కలిగియుండునట్లు' గ్రంథకర్త వారిని హెచ్చరించెను, ఏలయనగా 'పరిశుద్ధత లేకుండా ఎవడును దేవుని చూడడ'ని అతడు చెప్పెను 12:14. హెబ్రీ క్రైస్తవులు దేవుని కుమారులుగా ఎదుగనందుకు, వారు అపవిత్రమైన జీవితం జీవించు ప్రమాదం కలదని దీనిని బట్టి భావించవచ్చును. ఈ విషయములో అపవిత్ర జీవితమనగా:

ఎ. వారి మనస్సులో, హృదయములోగల కల్మషము వారి జీవితములో, సంఘ కుటుంబ ములో మరియు బయటవారికి కూడా సమాధానము లేకుండ చేయును.

బి. వారు లైంగిక అవినీతిని అభ్యాసం చేయవచ్చు.

సి. వారు దేవుడు లేనివారుగా లేక చెడిపోయిన వారుగా మారవచ్చు. ఒక పూట కూటి కొరకు తన జీవితమునే అమ్ముకొనిన ఏశావులాంటి వ్యక్తులుగా మారవచ్చు. ఏశావు మారుమనస్సు నొందలేకపోవుట విషాదకరమైన విషయము.

లోకమును తక్కువగా చూస్తు, ప్రభువును ఇంకా ఎక్కువగా చూడవలసిన అవశ్యకత వారికుంది.

12:18-28లో **మూడవ హెచ్చరిక** కనబడును. క్రైస్తవులు కాక మునుపు గ్రహీతలకు తెలిసిన దృశ్యమును వారి మనస్సులకు చూపాలని గ్రంథకర్త ఇంకా దానిని కొనసాగిస్తున్న అతని శైలిని దయచేసి గమనించుము.

మొదటి విషయము: మోషే పది ఆజ్ఞలను పొందిన కొండను గూర్చి వారికి తెలుసును... 12:18-21. "నేను మిక్కిలి భయపడి వణకు చున్నానని" మోషే చెప్పెను 12:21.

రెండవ విషయము: వారు దానిని మరచిపోయి ఉండవచ్చును 12:22-24.

ఈ పాఠ్యభాగములోగల ఒక్కొక్క పంక్తిని చదువుదాము. ఇది, గ్రంథకర్త ఈ గొప్ప పత్రికలో వెల్లడిచేసిన బోధలన్నింటి యొక్క సమ్మేళనము. యేసుయొక్క రాజరికము. మరియు యాజకత్వమును బట్టి ఇందు లోగల ప్రతి కృప, క్రైస్తవుల జీవితములో వాస్తవమాయెను. మెల్కీసెదెకు యాజకత్వము చొప్పున ఆయన తన యాజకత్వపు పని చేసెను.

మూడవ విషయము: 12:25-28 హెచ్చరిక లేక స్నేహపూర్వకముగా బుద్ధిచెప్పుట. 'మీకు బుద్ధి చెప్పుచున్నవారిని నిరాకరింపకుండునట్లు చూచుకొనుడి' అని ఈ పత్రికలో చెప్పుట ద్వారా గ్రంథకర్త తన సంపూర్ణ ఉద్దేశమును వెల్లడిచేసెను.

మోషే పది ఆజ్ఞలను పొందిన కొండను గూర్చి వారికి తెలుసును (12:18,22; నిర్గమ 19:10-23) అంతకంటే ఎక్కువ సమాధానమును, ఘనమైన సంబంధమును వారు దేవునితో కలిగియుండునట్లు యేసు వారికి అనుగ్రహిస్తున్నాడు (12:22,23). 'పరలోకము నుండి బుద్ధిచెప్పుచున్న వానిని మీరు నిరాకరింపకుండునట్లు చూచు కొనుడి' (12:25)యని అతడు మరల వారిని హెచ్చరించుటను చూడగలము. దేవుడు ఒకసారి భూమిని కంపింపచేసెను, గాని ఇంకొకసారి చలింప చేయబడిన వాటిని బొత్తిగా తీసివేయును. అయితే జ్యేష్ఠుల సంఘ సభ్యులైన మనము 'నిశ్చలమైన రాజ్యమును పొందియున్నాము' (12:28). క్రైస్తవులు ధైర్యముతో దేవుని కృపాసనము దగ్గరకు చేరుదురు. అయితే మన దేవుడు దహించు అగ్నియైయున్నాడు గనుక మనము వినయ భయభక్తులతో ఆయన సన్నిధిని చేరుదము 12:29. దేవుడు సామాన్యుడు కాడు, **ఆయన భయంకరుడు కూడ.**

'పరలోకమందున్న మా తండ్రి, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక;నీ రాజ్యము వచ్చుగాక; నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భుమియందును నెరవేరును గాక' (మత్తయి 6:9,10)యని మనము ప్రార్థన చేయవలెనని యేసు కొండ మీద ప్రసంగములో చెప్పెను. దేవుడు తన ధర్మవిధులను మన మనస్సుల మీద, మన హృదయముల మీద వ్రాయుట ద్వారా ఒక విధముగా మనము ఆయన రాజ్యమును పొందియున్నాము. అవి నిత్యజీవము కలిగిన జీవనియమములు గనుక మనము యేసు యొక్క సారూప్యములోనికి మార్చబడుటయే దాని ఫలితము. ఈ నియమ ములను, యేసు యొక్క స్వభావమందు కనుగొనగలము (రోమా 8:29). ఈ విధముగా మనము సాతాను రాజ్యమునుండి యేసుక్రీస్తు రాజ్యములోనికి పునఃసాంఘీకీకరణ

చెందుచున్నాము. అపొ. కార్య. 26:16-18; కొలొస్స.1:10-13ను చూడుము. ఇపుడు మనము దేవుని రాజ్యములో ఆయన కుటుంబ సభ్యులైన కుమారులము కుమార్తెలము అను అనుబంధమును కలిగియున్నాము (2 కొరింథీ. 6:18). నిత్యము దేవుని కుమారులుగా ఉందము. హెబ్రీ. 2:10-13 మరియు 12:5-8ను చూడుము.

12:25లో గ్రంథకర్త, గ్రహీతలను 2:2-4తో సంబంధింపజేయుచున్నాడేమో! దేవదూతల ద్వారా పలుకబడిన మాటలను విధిగా పాటించాలను విషయము యూదులకు తెలుసును. ఈ పత్రిక ద్వారా ప్రభువు పరలోకము నుండి హెబ్రీ క్రైస్తవు లతో మాటలాడుచున్నాడు. నేడు మనతో కూడా. నిజముగా మనము ఆ మాటలను వినవలసిన అవసరమున్నది.

ఈ క్రింద చూపబడిన 'దము' అని గ్రంథకర్త వినియోగించిన పదజాలములను గమనించు దము. సమీక్షించుటకు ఇది ఉపయోగపడును. ఈ పత్రికను మనము ఎలాగు చదవాలో దానిని గ్రహించుటకు ఈ పట్టిక మనకు సహాయకారిగా ఉండును.

1. మీలో ఎవడైనను ఒకవేళ ఆ వాగ్దానము (విశ్రాంతి) పొందకుండా తప్పిపోవునేమో అని భయము కలిగియుందము (4:11).
2. ఆ విశ్రాంతిలో ప్రవేశించుటకు జాగ్రత్తపడుదము (4:11).
3. మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదము (4:14).
4. మనము ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము (4:16).
5. మూలోపదేశము మాని, సంపూర్ణులమగుటకు సాగిపోదము (6:2).
6. మనము దేవుని సన్నిధానమునకు చేరుదము (10:22).
7. మన నిరీక్షణ విషయమై మన ఒప్పుకొనినది నిశ్చయముగా పట్టుకొందము (10:23).
8. ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్ప వలెనని ఆలోచింతము (10:25).
9. సమాజముగా కూడుట మానక (10:24).
10. ఒకనినొకడు హెచ్చరించుచు (10:24).
11. మనము కూడ ప్రతి భారమును, సుళువుగా చిక్కులు పెట్టు పాపమును విడిచిపెట్టి (12:1).
12. పందెములో ఓపికతో పరుగెత్తుదము (12:2).
13. యేసు వైపు చూచుచు (12:2).
14. ఆ కృప కలిగి వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము (12:28).

పైన చెప్పిన సమస్యలు, వారు కలిగియున్నారని గ్రంథకర్త తలంచెనా? అలాగైతే, ఆ క్రైస్తవులు, దేవునికి చేరువగుటకు ఈ పత్రిక వ్రాయబడెనని మనము భావించవలసి వస్తుంది. మనము మాటలాడునట్లు ప్రవర్తించుటకు సంఘము ప్రేమ చూపుటకును, సత్కార్యములను అభ్యసించు టకును, సమాజముగా కూడుకొని ఒకరినొకరు పురి కొల్పునట్లు మనము ఆలోచించి, ప్రణాళిక వేసుకొనునట్లు ఇది మనకు సహాయము చేయును.

గ్రంథకర్త మాటలను బట్టి గ్రహీతలు దేవుని వాక్యమునకు చెవినివ్వక పోయి నందున విశ్వాసము విడిచిపెట్టి కొట్టుకొనిపోవుచున్నట్టు అర్థమగుచున్నది (2:1). ఈ పత్రిక వ్రాయబడు సమయానికి, వారు వినిన సందేశమును విశ్వసింపక, విశ్వాసము లేని దుష్ట హృదయములతో వారు శ్రమపడుతున్నారేమో! (3:12-14; 4:2). 'దము'అని మనము గమనించిన మాటలలో కొన్ని ఈ ఆలోచనతో ఏకీభవించినట్లయితే, వారు తీవ్రమైన ఆత్మీయ సమస్య కలిగియున్నారను మన ఊహ సరియైనదే. కొంతమంది సంఘ సభ్యులు తమ రక్షణను పోగొట్టుకొను స్థితిలో ఉన్నారేమో! ఈ పత్రిక వారిని మళ్ళించుటకు వ్రాయబడినది.

క్రింద చెప్పబడిన మాటలు, వారి వ్యక్తిగత సమస్యలను గూర్చి ఈ పత్రికలో వివరించబడి యుంటే, కొంతమంది సంఘసభ్యుల సమస్యల పరిష్కారమునకు, ఇది అత్యవసరముగా వ్రాయబడి ఉంటుంది. 'మనము సత్యమును గూర్చి అనుభవ జ్ఞానము పొందిన తరువాత బుద్ధిపూర్వకముగా పాపము చేసిన యెడల పాపమునకు బలి యికను ఉండదు' (10:26). 'ఎవడైనను మోషే ధర్మశాస్త్రమును నిరాకరించిన యెడల ఇద్దరు ముగ్గురు సాక్షుల మాట మీద, కనికరింపకుండ వాని చంపించుదురు' (10:28)అను విషయము వారికి తెలుసును. 'దేవుని కుమారుని, పాదములతో త్రొక్కినవాడు ఎంత ఎక్కువైన దండనకు పాత్రుడుగా ఎంచబడునని మీకు తోచును?' (10:29)అని గ్రంథకర్త ప్రశ్న వేసి, వారు తమ ఆలోచన శక్తికి పదును పెట్టునట్లు చేసెను. ఆ తరువాత 'ప్రభువు తన ప్రజలకు తీర్పు తీర్చును' (10:30)అని హెచ్చరిం చెను. ఈ గ్రంథమంతటిలో వారు, మనము, మన మేధస్సుకు పదునుపెట్టునట్లు గ్రంథకర్త నిర్దేశించు వరుసక్రమమును గమనించండి.

వారిలో కొందరు ఆత్మీయ జీవితములో ఒక స్థాయిని చేరుకొన్న తరువాత, బుద్ధిపూర్వకముగా పాపము చేసిన వారైతే, వారు మారుమనస్సు పొందు అవకాశము లేనివారగుదురు (6:4-6). ఏశావు యొక్క సమస్యలాంటిది వారు కలిగి ఉండవచ్చును (12:16,17). అయినప్పటికిని, రచయిత ఆరవ అధ్యాయములో, 'అయితే ప్రియులారా, మేమీలాగు చెప్పుచున్నను, మీరింతకంటే మంచిదియు రక్షణకరమైనదియునైన స్థితిలోనే ఉన్నారని రూఢిగా నమ్ముచున్నాము (6:9)అని వారిని గూర్చి వెల్లడి చేయుచున్నాడు. మారుమనస్సు పొందు అవకాశము లేని వైఖరిగల వారికి కూడ ఇది సాధ్యమే. అయితే మారుమనస్సు పొందు అవకాశముగల క్రైస్తవులకే ఈ పత్రిక

వ్రాయబడినట్లు కనబడుచున్నది. వారిలో కొందరు బుద్ధిపూర్వకముగా చేసిన పాపము విషయములో మారు మనస్సు పొందు అవసరమున్నది. మిగతవారు 'వినుటకు మందులైనందుకు' అపాయ కర స్థితివైపు కొట్టుకొనిపోవుచున్నారు. ఈ ఊహ సరియైనదైతే, గ్రహీతల పరిస్థితిని వారికి తెలియపరచవలసిన గురుతర బాధ్యత ఈ పత్రికకు ఉంది. దానిని అది నెరవేర్చినది. ప్రతి సమస్యను మనము ఊహించాము గనుక వాటికి సంబంధించిన పరిష్కారములన్నింటిని మనము ఈ పత్రికలో కనుగొనవలెను.

మొదటి అధ్యాయము నుండి పన్నెండవ అధ్యాయము వరకు మనము ఎక్స్‌జీసస్ చేసి కనుగొన్న ఖచ్చితమైన మరియు ఊహాజనితమైన సమస్యలన్ని ఆత్మీయ పెరుగుదలకు సంబంధించిన కోవకే చెందును. కాబట్టి ఆత్మీయ పెరుగుదలను ప్రోత్సాహించుటకే హెచ్చరిక మాటలన్ని ఇవ్వబడినవి, వాటిని మనము నిర్లక్ష్యము చేయకూడదు.

13వ అధ్యాయములలో మరికొన్ని హెచ్చరిక మాటలు కలవు వాటిని మనము నిర్లక్ష్యము చేయకూడదు. అవి గత అధ్యాయములలో ఉన్న విషయానికివిభిన్నమైన రూపాలలో ఇవ్వబడినవి గనుక, వాటిని మనము సాధారణ హెచ్చరికలగానే భావించ వచ్చును. ఆత్మీయ పెరుగుదలకు సంబంధించిన సాధారణ హెచ్చరిక మధ్యలో 'దము' అను మాటను రెండుచోట్ల కనుగొందము. అవి బోధకు సంబంధించిన సమస్యను సూచించును.

15. కాబట్టి ఆయన నిందను భరించి శిబిరము వెలుపలికి వెళ్ళుదము (13:13).

16. మనము దేవునికి ఎల్లప్పుడు స్తుతియాగము చేయుదము (13:15).

వీటిని బట్టి కొంతమంది హెబ్రీ క్రైస్తవులు దేవుడు మోషే ద్వారా అనుగ్రహించిన పాతనిబంధన వైపు మరలుటకు ఆసక్తి చూపియుండవచ్చును. లేవి యాజకత్వమునకు సంబంధించి అబద్ధ బోధయైన యూదామతమును గూర్చి ఈ పత్రికలో ప్రస్తావించ లేదు. 'దము'అను మాటతో పాటు ఇవ్వబడిన హెచ్చరికను బట్టి, 'నానా విధములైన అన్యబోధల చేత త్రిప్పబడకుడి' (13:9)అను మాటను బోధకు సంబంధించిన సమస్యగా మనము సిద్ధపరచిన మన ఊహాజనితమైన పట్టికలో చేర్చవచ్చును. ఊహించిన పట్టిక మరియు ఖచ్చితమైన పట్టికలలోగల విషయములన్నిటిని పరిశీలించి, ఏ దృష్టి కోణముతో ఇపుడు మనము హెబ్రీ పత్రికను చదువవలెనో నిర్ణయించుదము.

మనము ఈ గొప్ప పత్రికను బాగా వ్యక్తిగతమైన రీతిలో చదవవలసిన అవసరత యున్నదని ఈ పాఠముల గ్రంథకర్త యొక్క భావమైయున్నది. ఈ పత్రిక అప్పుడు వారు అనగా హెబ్రీ క్రైస్తవులు ఎంత పతనావస్థకు చేరుకున్నారో తెలుపుచు ఇప్పుడు మన పరిస్థితి అట్లు ఉన్నదేమో అని మనము వ్యక్తిగతముగా చదువనుద్దేశింపబడినది. వారు మొదట వెలిగింపబడినప్పుడు వున్న ఆత్మీయ ఆసక్తి నుండి పత్రిక వ్రాయబడు సమయమునకు ఏ మేర దిగజారిపోయివున్నారో గమనించండి హెబ్రీ 10:32-34. తప్పుడు కోణములో ఈ పత్రికను చదివినట్లైతే గొప్ప ఆత్మీయ నష్టము కలుగుతుంది. హెబ్రీ క్రైస్తవులకు సిద్ధాంత సంబంధమైన సమస్య ఉండి ఉండవచ్చు. కాని వారి ఆత్మీయ ఎదుగుదల సమస్యలతో పోల్చితే అది చిన్నది. గమనించండి, బైబిలును ధ్యానించు ప్రతి చదువరి అదే సమయమున వ్యాఖ్యాతయి ఉన్నాడు, కావున మనలో ప్రతి ఒక్కరు మన స్వంత ప్రాకల్పనను తప్పకుండా చేయవలసియున్నది.

హెబ్రీ పత్రికను పొందిన వారి మధ్య ఏమి జరుగుతున్నదో తెలుసుకొనవలెనన్న మన జిజ్ఞాస ఇపుడు పూర్తికావచ్చెను. కాబట్టి గ్రంథకర్త హెబ్రీ క్రైస్తవుల ఆత్మీయ బలహీనతలను మరియు బలమును గూర్చి ఏమి చెప్పెనో మనము ఇపుడు అర్థంచేసుకొనగలము. గ్రంథకర్త యొక్క శైలిని మనము అనుసరించుట వలన పాత నిబంధనను గూర్చి గ్రహీతలకు ఏమి తెలుసునో, దానిని మనము తెలుసుకోగలిగాము. వారు కలిగియున్న పరిస్థితి యొక్క లోతుపాతులును కూడా తెలుసుకొన్నాము. మనము మంచి ఎక్స్‌జీసస్‌ను చేయగలిగాము. 'అప్పుడు మరియు అక్కడ' గల పరిస్థితిని ఇపుడు మనము అర్థము చేసుకొనగలుగుతున్నాము.

దేవుని నుండి కలిగిన ఈ లేఖనములకు అర్థము చెప్పు విషయములో మనకు మంచి పట్టు కలిగియుండునట్లు ఇది ఇపుడు మనకు సహాయకారిగా ఉండును. మనము నేర్చుకొన్న బోధలు మరియు జీవపు సూత్రములే మన విశ్వాసమై యుండ వలెను. ఈ బోధలు మరియు సూత్రముల భావమును (హెర్మెన్యూటిక్స్) మనము కలిగియున్న పరిస్థితికి అనుగుణముగా మనము అన్వయించ వచ్చును. మన అనుదిన జీవితము వెలిగింప బడుటకు మనకు దైవిక నడిపింపు గలదు.

దయచేసి హెబ్రీ పత్రికను పఠించుటను మనము పూర్తి చేయలేదని గమనించాలి. ఆ పత్రికను చదువుటకు మనకు మనము సిద్ధపరచుకొంటిమి. ఈ గొప్ప పత్రిక ద్వారా పరిశుద్ధాత్మ ఏమి చెప్పుచున్నాడో ఇపుడు మనము వినగలుగుచున్నాము.